నిర్లక్ష్యంతో పొంచి ఉన్న ముప్పు

- పురుగు మందుల స్ప్రేయింగ్‌లో జాగ్రత్తలు తప్పనిసరి
- పనిలో నిర్లక్ష్యం వహిస్తే ఆరోగ్యానికి హానికరం


పంట పొలాల్లో స్ప్రేయింగ్ పనులు చేస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: రైతులు సాగు చేస్తున్న పంటల్లో చీడ పీడల నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తారు. ప్రస్తుతం రసాయనిక పురుగు మందుల వాడకం తప్పనిసరిగా మారింది. ఈ పరిస్థితుల్లో పిచికారీ చేసే వ్యక్తులు తప్పనిసరిగా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెప్తున్నారు. పంట పొలాల్లో పంటలకు స్ప్రేయింగ్ పనులు చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఆరోగ్యం వికటించి ఆస్పత్రుల పాలైన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఆదమరిస్తే ప్రాణ నష్టం కూడా జరిగే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. పంటల్లో పురుగు మందులు స్ప్రే పనులు చేసే సమయంలో రైతులు, కూలీలు తీసుకోవలసిన జాగ్రత్తలపై మండల వ్యవసాయాధికారి డి.ముత్యాలరావు సూచనలు తెలిజేశారు.

- పంటలో పురుగు మందు స్ప్రే చేసే సమయంలో శుభ్రమైన నీటిని వాడడంతో పాటు చేతులకు, కళ్లకు, ముక్కు, నోటికి, చెవులకు తప్పనిసరిగా ప్రత్యేక రక్షణ తీసుకోవాలి.
- పురుగు మందులతో పాటు వచ్చిన కవర్లను వినియోగించకూడదు.
- తలకు టోపీతో పాటు ముఖం మొత్తం కప్పేటట్టు చూసుకోవాలి.
- ద్రావణాన్ని కలిపే ముందు డబ్బాపై ఉన్న లేబుల్‌ను గమనించి దాని ప్రకారం అవసరానికి అనుగుణంగా మందు కలుపుకోవాలి.
- మందు కలిపే సయమంలో ఖచ్చితంగా కళ్లకు కళ్లజోడు పెట్టుకోవాలి. లేనిపక్షంలో మందు కలిపే సమయంలో అది కళ్లల్లో పడకుండా జాగ్రత్త పడాలి.
- మందు ద్రావణాన్ని పంపులో పోసేటప్పుడు, స్ప్రేయింగ్ చేసే సమయంలో సిగరెట్టు, బీడీ, కైనీ వంటివి వేసుకోకూడదు.
- మందును ముక్కుతో వాసన చూడకూడదు. మందు స్ప్రేయింగ్ తర్వాత భోజనం చేసే సమయంలో తప్పని సరిగా చేతులు శుభ్రం కడుక్కోవాలి.
- స్ప్రేయింగ్ చేసే డబ్బా సరైనది ఎంచుకోవాలి. డబ్బా లోపలి నుంచి లీక్ అవ్వకుండా చూసుకోవాలి.

సరైన నాజిల్ ఎంచుకోవాలి. మందు స్ప్రేయింగ్ సమయంలో నాజిల్‌లో ఏదైనా అడ్డు పడితే నోటితో ఊదకూడదు.

- గాలి ఎక్కువగా వీచే సమయంలో ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు స్ప్రేయింగ్ పనులను ఆపివేయాలి.
- మందు స్ప్రేయింగ్ చేసే సమయంలో గాలి వీస్తున్నట్లయితే గాలికి వ్యతిరేకంగా స్ప్రేయింగ్ పనులు చేయకుండా గాలి వాలుకు చేసుకోవాలి.
- మందులు కలిపిన డబ్బాల్లో నీరు పట్టుకొని తాగ కూడదు.

పురుగు మందుల డబ్బాలను విచ్చల విడిగా పడేయకూడదు

పంటలకు చేపట్టిన పురుగు మందులు స్రేయింగ్ పనులు పూర్తయిన తరువాత డబ్బాలను విచ్చల విడిగా పడేయకూడదు. డబ్బాలను కడిగి కాలువలు, నీటి కుంటల్లో పోయకూడదు. అవసరానికి అనుగుణంగా మాత్రమే మందులను కలుపుకోవాలి. మిగిలిన మందు డబ్బాలను నివాస ప్రాంతాలకు దూరంగా ఉంచుకునే ఏర్పాటు చేసుకోవాలి. చిన్న పిల్లలకు, పశువులకు దగ్గరగా పురుగు మందు డబ్బాలు ఉండకుండా చూడాలి.

నిర్లక్ష్యం వహిస్తే ఆరోగ్యానికి హాని



పంట పొలాల్లో పురుగు మందుల స్ప్రేయింగ్ పనులు చేసే సమయంలో రైతులు, వ్యక్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే ఆరోగ్యానికే హానికరం ఏర్పడుతుంది. పనుల సమయంలో ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు వస్తుంది. కచ్చితమైన జాగ్రత్తలు పాటించాలి.

డి.ముత్యాలరావు మండల వ్యవసాయాధికారి, బుట్టాయగూడెం మండలం

కార్యకర్తలకు అండగా నిలబడాలి

వైఎస్సార్‌సీపీ నేతలకు అధినేత వైఎస్ జగన్ సూచన

కొయ్యలగూడెం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా నిలబడి వారికి భరోసా కల్పిస్తూ పార్టీ పటిష్టతకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించారని ఏలూరు జిల్లా గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చిటికెన శ్రీనివాస్ గురువారం తెలిపారు. తాడేపల్లిలోని మాజీ ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో కలుసుకున్న సందర్భంగా పార్టీ గురించి శ్రేణుల గురించి దిశా నిర్దేశం చేశారన్నారు. సూపర్ సిక్స్ పథకాల హామీ కూటమి ప్రభుత్వం నీరుగార్చిందని దీంతో ప్రజల్లో ఉన్న అసంతృప్తికి మద్దతిస్తూ ప్రజా ప్రతినిధులను నిలదీయాల్సిందిగా సూచించారన్నారు. ఈ సందర్భంగా కొయ్యలగూడెం మండలంలో వైఎస్సార్‌సీపీ కోసం కష్టపడుతున్న కార్యకర్తల వివరాలను వైఎస్ జగన్ అడిగి తెలుసుకున్నారన్నారు.

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన సీనియర్ నేత గురునాథరెడ్డి

జంగారెడ్డిగూడెం రూరల్: తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మండలంలోని లక్కవరానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాథరెడ్డి కుటుంబ సమేతంగా మర్యాద పూర్వకంగా కలిశారు. గురునాథరెడ్డితో పాటు ఆయన సతీమణి సచివాలయ కన్వీనర్ శ్రీదేవి, కుమారుడు జగదీష్‌రెడ్డితో కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ ప్రాంతంలో పలు సమస్యలను వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు గురునాథరెడ్డి తెలిపారు. పర్యటనలో భాగంగా జంగారెడ్డిగూడెం ప్రాంతానికి రావాల్సిందిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరినట్లు తెలిపారు.


వైఎస్సార్‌సీపీ అధినేతతో కుక్కునూరు యూత్ లీడర్ సూర్ల రాము


వైఎస్సార్‌సీపీ అధినేతతో పోలవరం సోషల్ మీడియా కన్వీనర్ మళ్లేల చంటినాయుడు

వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసిన జ్ఞానారెడ్డి

చింతలపూడి: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి గురువారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు నెలల్లోనే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, భవిష్యత్తు వైఎస్సార్‌సీపీదేనని కార్యకర్తలు అధైర్య పడొద్దని చెప్పినట్లు జ్ఞానారెడ్డి తెలిపారు. త్వరలోనే తాను ప్రతీ కార్యకర్తను కలుసుకుంటానని, ఏలూరు జిల్లాలో పార్టీ పటిష్టతపై దృష్టి పెట్టాలని సూచించినట్లు తెలిపారు.

వైఎస్ జగన్‌ను కలిసిన సోషల్ మీడియా కన్వీనర్

కుక్కునూరు: పోలవరం నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ మళ్లేల చంటినాయుడు, మండల యూత్ లీడర్ సూర్ల రాము గురువారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా చంటినాయుడు మాట్లాడుతూ కూటమి నాయకులు పోలీస్ స్టేషన్‌లో తనపై చేసిన దాడి విషయమై అధినేత క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారన్నారు. అంతేకాక దాడికి సంబంధించి వీడియోలను కూడా చూశారని చంటినాయుడు చెప్పారు. ఈ సందర్భంగా అధైర్య పడొద్దని ధైర్యం చెప్పడంతోపాటు కుక్కునూరు వచ్చి కుటుంబ సభ్యులతో మాట్లాడతానని జగనన్న చెప్పారని చంటినాయుడు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ చిలకాల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.


వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి జ్ఞానారెడ్డి


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌ను కలిసిన చిటికెన శ్రీనివాస్, తదితరులు


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌తో సీనియర్ నేత నిమ్మ గురునాథరెడ్డి

కరుణించమ్మా.. కనకదుర్గమ్మ


జంగారెడ్డిగూడెం: మహాకాళిగా చాముండేశ్వరిదేవి


చింతలపూడి: విశ్వనాధ మఠంలోని రాజరాజేశ్వరి అమ్మవారు


లింగపాలెం: దుర్గాదేవి అలంకరణలో కనకదుర్గమ్మ


జంగారెడ్డిగూడెం రూరల్: దుర్గాదేవిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరి అమ్మవారు

జంగారెడ్డిగూడెం: స్థానికంగా కొలువైన అమ్మవార్లు గురువారం దుర్గాదేవిగా భక్తులతో పూజలందుకున్నారు. జంగారెడ్డిగూడెం గ్రామ దేవత గంగానమ్మ, నూకాలమ్మ, ముత్యాలమ్మ, విజయదుర్గమ్మ, వాసవీ కన్యకాపరమేశ్వరిలు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమివ్వగా, హైస్కూల్ వద్ద ఉన్న దుర్గమ్మ కనకదుర్గాదేవిగా, చాముండేశ్వరి అమ్మవారు మహా కాళిగా భక్తుల పూజలందుకున్నారు. నూకాలమ్మ ఆలయంలో 108 మేరువులకు సామూహిక పూజలు నిర్వహించారు. ఆలయంలో సహస్ర దీపాలంకరణ వైభవంగా నిర్వహించారు.

ఘనంగా దసరా నవరాత్రి ఉత్సవాలు

చింతలపూడి: మండలంలోని పలు గ్రామాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం స్థానిక విశ్వనాథ మఠంలో రాజరాజేశ్వరీ అమ్మవారు భక్తులకు కనకదుర్గమ్మదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరీ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

దుర్గాదేవి అలంకరణలో అమ్మవార్లు

జంగారెడ్డిగూడెం రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలో కొలువైన అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురవాయిగూడెం రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు, అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంలో కొలువైన శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవార్లు దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.


కొయ్యలగూడెం: సామూహిక పూజలు నిర్వహిస్తున్న మహిళా భక్తులు

భవానీల ప్రత్యేక పూజలు

కొయ్యలగూడెం: శరన్నవరాత్రుల్లో అత్యంత కీలక ఉత్సవ దినాలు, అమ్మవార్ల అలంకరణలు పెద్ద ఎత్తున ప్రారంభమయ్యాయి. దసరా మహోత్సవాలలో భాగంగా గురువారం కనకదుర్గమ్మ దుర్గాదేవి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చింది. కన్నాపురం, అచ్యుతాపురం, గవరవరం, బయ్యన్నగూడెం, నరసన్నపాలెం వై.జంక్షన్, రాజవరం, యర్రంపేట, గ్రామాలలో భవానీల భక్తులు కనకదుర్గమ్మకు సామూహిక పూజలు నిర్వహించారు.

అమ్మవారికి బోణాల సమర్పణ

టి.నరసాపురం: కనకదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులు అమ్మవారికి బోణాలు సమర్పించి, మహా నైవేద్యం కార్యక్రమాన్ని నిర్వహించారు.

దుర్గాదేవిగా కనకదుర్గమ్మ

లింగపాలెం: మండలంలోని ధర్మాజీగూడెంలో వేంచేసియున్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో గురువారం దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శ్రీ దుర్గాదేవి అవతారంలో అలంకరించారు.

సామూహిక కుంకుమ పూజలు

పోలవరం రూరల్: శరన్నవ రాత్రి మహోత్సవాల్లో ఎనిమిదో రోజు గురువారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజా కార్యక్రమాలు, లలితా సహస్ర నామ పారాయణాలు నిర్వహించారు.

వాడ వాడలా బతుకమ్మ సంబరాలు

కుక్కునూరు: దసరా ఉత్సవాలలో భాగంగా గురువారం బతుకమ్మ సంబరాల్లో చివరి రోజు మండలంలో ఘనంగా నిర్వహించారు. మహిళలు రకరకాల పూలతో బతుకమ్మలను పేర్చి పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను వాగుల్లో,చెరువుల్లో, కుంటల్లో నిమజ్జనం చేశారు.

క్లుప్తంగా

చెట్ల కొమ్మలను తొలగించాలి


అటవీ సమీపంలో వర్షాలకు రోడ్లపై విరిగిపడిన కొమ్మలు

బుట్టాయగూడెం: ఇటీవల కురిసిన వర్షాలకు బుట్టాయగూడెం నుంచి జంగారెడ్డిగూడెం వెళ్లే రహదారి మర్లగూడెం అటవీ ప్రాంతంలో చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. అవి వాహనాలకు అడ్డంగా ఉండడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలపై వెళ్లే వారికి తగులుతున్నాయి. సంబంధిత అధికారులు ఆ చెట్ల కొమ్మలను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు


వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న పలు శాఖల అధికారులు

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో పలు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది గురువారం ఆపరేషన్ స్వేచ్ఛ తేజ్–3 కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా టాస్క్‌ఫోర్స్ టీం, పోలీస్, కార్మిక, విద్య, చైల్డ్‌లైన్ శాఖల అధికారులు, సిబ్బంది కొండపై పలు దుకాణాలను తనిఖీ చేశారు. 14 సంవత్సరాల వయస్సు లోపు బాలలను పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఏపీ సీఐడీ ఉత్తర్వుల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు


వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం: మండలంలోని అచ్చియ్యపాలెంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో డాక్టర్ తెల్లం గంగాధర్‌రావు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గంగాధర్‌రావు మాట్లాడుతూ తాను అచ్చియ్యపాలెం గ్రామానికి చెందిన వ్యక్తినేనని తెలిపారు. ప్రస్తుతం తాను తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల ప్రభుత్వాస్పత్రిలో ప్రధాన వైద్యాధికారిగా పని చేస్తున్నానని చెప్పారు. ఆమెన్ ట్రస్ట్ సహకారంతో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంజా వెంకటేశ్వరరావు, కేఆర్‌పురం ఐటీడీఏ ఏఎంఓ కొవ్వాసి శిరమయ్య, డాక్టర్ దీపాంజలి, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం


న్యాయ విజ్ఞాన సదస్సులో పాల్గొన్న వక్తలు

జంగారెడ్డిగూడెం: ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో హరిజన పేట యూపీహెచ్‌సీలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బార్ ప్రెసిడెంట్ ముళ్లపూడి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో మాజీ బార్ అధ్యక్షులు అచ్యుత శ్రీనివాసరావు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి వలన అనేక వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి రోజూ యోగ సాధన చేయడం ద్వారా ఒత్తిడిని జయించవచ్చని తెలిపారు. కార్యక్రమం భాగంగా డాక్టర్ ఐ.సందీప్‌కుమార్, హాస్పటల్ సిబ్బంది, బార్ మెంబెర్స్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


పైపులైన్లకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పరింపూడి ఎస్సీ బాలికల హాస్టల్ వద్ద మరమ్మతులకు గురైన తాగునీటి పైపులైన్ పనులు గురువారానికి పూర్తయ్యాయి. పైపులైన్లు పాతవి కావడంతో తరచూ తాగునీటి సమస్యలు ఏర్పడుతున్నాయి. పదిహేను రోజుల నుంచి తాగునీటి ఎద్దడి తీవ్రం కావడంతో స్థానికులు సమస్యను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సర్పంచ్ ముప్పిడి విజయలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణ, ఉప సర్పంచ్ శంకు కొండ స్పందించి మరమ్మతులకు గురైన పైపులైన్‌ను తొలగించి నూతన పైపులైన్ నిర్మాణం చేపట్టారు. శ్రీరామ్ నగర్ వాటర్ ట్యాంక్ రామాలయం ప్రాంతంలో వీధిలైట్లు వెలగడం లేదని సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

కార్మికులను ఆదుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు సాయికిరణ్

కుక్కునూరు: మండలంలోని ఇసుక ర్యాంప్‌లోని ఇసుక రవాణాకు లోకల్ లారీలను వినియోగించి లారీ కార్మికులను ఆదుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం లారీ అండ్ మినీ వ్యాన్, టాటా ఏసీ, బొలెరో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోషియేషన్ సమావేశం నిర్మల వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో సాయికిరణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మండలంలో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంప్‌లతో లారీ కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. స్థానిక లారీలకు కిరాయిలు లేక అవస్థలు పడుతుంటే స్థానిక ఇసుక ర్యాంప్ నుంచి ఇసుకను బయటి నుంచి వచ్చిన లారీలతో రవాణా చేయిస్తున్నారని వాపోయారు. ఇకనైనా స్థానిక లారీలను ఇసుక రవాణాకు వినియోగించాలన్నారు. సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎండీ వలీ పాషా, సభ్యులు ఎల్లయ్య, కట్టబోయిన మల్లేష్, రవి,కాశి, ఓగిరాల నాగరాజు, అంగిరేకుల వెంకటేశ్వరావు, కొప్పెర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాను అరికట్టండి

కొయ్యలగూడెం: ఇసుక మాఫియా ఆగడాలు అరికట్టి సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక నినాదంతో పాలనలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుకను అర్హులకు అందుబాటులో లేకుండా చేసిందన్నారు. ఇసుకను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారు రోజుల తరబడి ఎదురు చూస్తున్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని, అదే సమయంలో బ్లాక్ మార్కెట్‌లో ఐదు టన్నుల ఇసుక లారీలు అందుబాటులో ఉండటం విడ్డూరంగా ఉందన్నారు. కేవలం రాజకీయ నాయకుల ప్రమేయంతో ఇసుక దందాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ విషయంపై గవర్నర్, హైకోర్టు జడ్జి, అసెంబ్లీ స్పీకర్లకు లేఖను పంపినట్లు ఆయన తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: స్థానిక ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో పని చేస్తున్న నలుగురు ఉద్యోగులు సంస్థ సొమ్మును సొంతానికి వాడుకున్న ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రామచంద్రాపురంలో స్పందన స్ఫూర్తి ఫైనాన్షియల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో బ్రాంచి మేనేజర్‌గా దాసరి వంశీ, కలెక్షన్ ఏజెంట్లుగా యర్రగొర్ల రవితేజ, కంచర్ల ఉదయ్‌కుమార్, అబ్బదాసరి నరేష్ పని చేస్తున్నారు. అయితే సంస్థలో ఇటీవల ఆడిటర్ పులిమామిడి రమేష్ నిర్వహించిన ఆడిట్‌లో ఉద్యోగులు నలుగురు రూ.8,16,988 వారి సొంతానికి వాడుకున్నట్లు గుర్తించారు. దాసరి వంశీ రూ.5,46,604, యర్రగొర్ల రవితేజ రూ.1,02,811, కంచర్ల ఉదయ్‌కుమార్ రూ.37,533, అబ్బదాసరి నరేష్ రూ.1,30,040 సొంతానికి వాడుకున్నట్లు గుర్తించారు. దీనిపై ఆడిటర్ రమేష్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే



చింతలపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మండలంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. మండలంలో మొత్తం 700 వరకు దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ డాక్టర్ రాంబాబు నాయక్, తహసీల్దార్ డి.ప్రమద్వర, మాజీ ఏఎంసీ ఛైర్మన్ జగ్గవరపు ముత్తారెడ్డి అధికారులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

జంగారెడ్డిగూడెం: స్థానిక పాతబస్టాండ్‌కు చెందిన మన్యం దుర్గారావు అనే వ్యక్తి రూ.11,660 విలువైన 79 మద్యం బాటిళ్లను తన ఇంటి వద్ద ఉంచుకున్నాడని ఎస్సై ఎస్‌కే జబీర్ తెలిపారు. మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.